కరపత్రం

# అమెరికా దురహంకారానికి తాజా బలిపశువులు ఆఫ్ఘన్లు

ఆఫ్ఘనిస్తాన్ పైన అమెరికా యుద్ధం మొదలయి నెలరోజులు దాటింది. 'వేగంగా, క్లుప్తంగా' ముగిస్తామని తొలినాడు ఇచ్చిన హామీని అమెరికాయే మరచిపోయినట్టయింది. సాధారణ పౌరులకు హాని కలిగించమన్న హామీ మాటకొస్తే, ప్రపంచం ఆ హామీ కోరిందిగానీ అమెరికా ఇవ్వనేలేదు.

ఎందుకివ్వలేదో ఇప్పుడు అర్థమవుతూనే వుంది. ఈ నెలరోజుల్లో యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వారూ, నిలువ నీడ కోల్పోయిన వారూ అందరూ సాధారణ పౌరులే. ఏ 'దుర్మార్గుల' వేటకోసమయితే అమెరికా బయలుదేరిందో వారిలో ఒకరు కూడా – బుష్ భాషలో చెప్పాలంటే వారి శవాలైనా అమెరికాకు దొరకలేదు.

యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కూడ లేవు. రంజాన్ పండుగ రోజులలో యుద్ధ విరమణ పాటించమని పాకిస్తాన్ అధ్యక్షుడు ముషార్రఫ్ అమెరికా అధ్యక్షుడిని అడిగిన సంగతి పత్రికలలో చదివాం. దానికి ఆయన ఏం జవాబు చెప్పాడు? ఒసామా బిన్ లాడెన్‌ను పట్టుకొని యుద్ధాన్ని క్లుప్తంగా ముగిస్తానని మొదట్లో చెప్పిన పెద్దమనిషి, 'రంజాన్ దాకా యుద్ధమెందుకు కొనసాగిస్తాను? ఆలోపలే ముగిస్తాను' అని చెప్పలేదు. రంజాన్ నెలలో కూడా కొనసాగిస్తాననే అన్నాడు.

మొదట్లో ఈ యుద్ధానికి అనుకూలంగా వున్నవారు సహితం ఇప్పుడు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరో చేసిన తప్పుకు వేరెవరో ఎందుకు చావాలి? ఎంతమంది చావాలి? అసలీ యుద్ధం బిన్ లాడెన్‌ను పట్టుకోవడం కోసమేనా? లేకపోతే ఆ పేరుచెప్పి అమెరికా వేరే ప్రయోజనాలు సాధించుకునే ప్రయత్నంలో నిమగ్నం అయిందా? తాలిబన్ల యుద్ధ సామర్థ్యాన్ని ధ్వంసం చేసే పేరుమీద ఆఫ్ఘనిస్తాన్‌కు వున్న కొద్దిపాటి పారిశ్రామిక సామర్థ్యాన్ని, సాంకేతిక సామర్థ్యాన్ని కూడా ధ్వంసం చేయడం సబబా? దానివల్ల సాధారణ ఆఫ్ఘన్ ప్రజల భవిష్యత్తు దెబ్బతినదా? ఇత్యాది సందేహాలు ఇప్పుడందరికీ వస్తున్నాయి.

ఎట్లాగో సందేహాలు వస్తున్నాయి కాబట్టి కొంచెం వెనక్కిపోయి అసలు ఈ యుద్ధం తలపెట్టడమే న్యాయమా? సెప్టెంబర్ 11 నాటి సంఘటనకు అమెరికా తీర్చుకుంటున్న పగ, ప్రతీకార పద్ధతి సరయినదేనా అన్న ప్రశ్నలు మనమందరం వేసుకుందాం.

నిజమే, ఆ దౌర్జన్యం అమెరికాకు న్యాయంగానే ఆగ్రహం కలిగించింది. తన దేశ ప్రజలను కాపాడలేకపోయిన తన అశక్తతకు బుష్ దుఃఖించి కన్నీళ్లు పెట్టుకున్నాడు. గతంలో అమెరికా జపాన్ మీద అణుబాంబులు వేసి మూడున్నర లక్షల మందిని చంపినప్పుడు జపాన్ రాజు కన్నీళ్లు పెట్టినట్టు, వియత్నాం రైతాంగం మీద అమెరికా కురిపించిన 'నాపామ్' బాంబుల దాడి నుండి కాపాడలేకపోయిన వియాట్‌కాంగ్ గెరిల్లాలు కన్నీళ్లు పెట్టినట్టు, అమెరికా క్షిపణుల దాడికి ధ్వంసమైన తన దేశాన్ని చూసి ఇరాక్ పాలకుడు సద్దాం హుసేన్ కన్నీళ్లు పెట్టినట్టు, అమెరికా విధించిన ఆంక్షల వల్ల మందులు కరవయి తమ కళ్లముందే చనిపోతున్న పసిపిల్లలను చూసి ఇరాక్‌లోని వైద్యులు నిస్సహాయంగా కన్నీళ్లు పెట్టినట్టు, చిలీ అధ్యక్షుడు సాల్వడార్ అలెండీని అమెరికా గూఢచార సంస్థ హతమార్చినప్పుడు తమ ప్రియతమ నాయకుడిని కాపాడుకోలేకపోయామని చిలీ దేశ ప్రజలు కన్నీళ్లు పెట్టినట్టు, అమెరికా ప్రేరణతో ఇజ్రాయిల్ సైన్యం అకస్మాత్తుగా దాడిచేసి 17 వేల మంది పౌరులను తమ కళ్లముందే హతమారుస్తుంటే ఏమీచేయలేని లెబనాన్ దేశ పాలకులు నిస్సహాయంగా కన్నీళ్లు పెట్టినట్టు...

వీళ్ళందరిలాగే బుష్ కూడ కన్నీళ్లు పెట్టాడు. ఆ మాత్రం మానవత్వం వున్నందుకతనిని గౌరవిద్దాం. కానీ తమకు అన్యాయం జరిగిందని భావించే వాళ్లు, ఆ అన్యాయం చేసిందెవరు? అన్నదానితోపాటు ఎందుకు చేశారు? అన్న ప్రశ్నను కూడా వేసుకోవాలి.

అమెరికాకు మొదటి ప్రశ్నకు జవాబు తెలీదు. రెండవ ప్రశ్న వేసుకోదు. సెప్టెంబర్ 11 నాటి దాడికి ఒసామా బిన్ లాడెన్ బాధ్యుడనడానికి తన దగ్గర వున్న ఆధారాలుగా అమెరికా చూపిస్తున్న సాక్ష్యాలు 'ఏ కోర్టులోనూ నిలబడవు' అని బ్రిటన్‌కు చెందిన లాయర్లు అన్నారు.

ఇంక ఎందుకు చేశారన్న ప్రశ్న దగ్గరికి వస్తే, చేసినవారెవరయినా అది అమెరికా కొన్ని దశాబ్దాలుగా అనుసరిస్తున్న దౌర్జన్యనీతికి ప్రతీకారంగా జరిగిందనేది స్పష్టమే. తన ప్రయోజనాలకు ఎవరు అడ్డం వచ్చినా, వాళ్ళను మళ్లీ లేవకుండ చితకగొట్టడం అమెరికా విదేశాంగ నీతి. అదొక ప్రభుత్వమైతే ఆ దేశాన్నే ధ్వంసం చేస్తుంది. అదొక ఉద్యమమైతే దానికి మద్దతుగా వున్న ప్రజల జీవితాలను నాశనం చేస్తుంది. అమానవీయమైన ఈ నీతినే సెప్టెంబర్ 11న దాడిచేసిన వారు అమెరికా మీదే తిరిగి ప్రయోగించారు.

అందువల్ల అది సమర్థనీయమని మేము అనడంలేదు. కానీ ఈ వాస్తవాన్ని గుర్తించినట్టయితే ఆ దౌర్జన్యానికి పాత పద్ధతిలోనే – "వాడినీ, వాడికి మద్దతు ఇచ్చిన వారినీ సర్వనాశనం చేస్తాం" అనే పద్ధతిలోనే స్పందించడం చాలా తప్పని గుర్తించ గలుగుతాం.

కానీ అమెరికా అదే తప్పు తిరిగి చేస్తూ వుంది. యాభై ఏళ్ళకు పైగా అమెరికా అనుసరిస్తున్న దౌర్జన్యపూరితమైన విదేశాంగ నీతి ఏదైతే పరిస్థితిని ఇక్కడిదాకా తీసుకొచ్చిందో అదే నీతిని ఆఫ్ఘనిస్తాన్‌లో కొనసాగిస్తున్నది. దానికి ఇప్పటికే కొన్ని వందల మంది ఆఫ్ఘన్ పౌరులను బలిచేసింది. ఇంకా వందలాది మందిని బలిచేయబోతోంది. దీనిని ఖండించడం అవసరం.

అమెరికా అనుసరిస్తున్న యుద్ధం, ప్రచార వైఖరి ఆఫ్ఘనిస్తాన్ ప్రజలకు చాలా అన్యాయం చేయడమే కాక ప్రపంచ వ్యాప్తంగా ముస్లింల పట్ల వ్యతిరేకతను, ద్వేషాన్నీ పెంచుతున్నది. కాదు కాంటూనే పాశ్చాత్య దేశాలు దీనిని “అనాగరికమైన ఇస్లాంకు నాగరికమైన ఇతర సమాజాలకు మధ్య యుద్ధంగా” చూపిస్తున్నాయి. ఇదే అదనని మన పరివార్ పాలకులు తమ అసలు అజెండాను మొత్తంగా అమలు చేయడానికి తయారవుతున్నారు.

చాలా నష్టకరమైన, ప్రమాదమైన, అన్యాయమైన ఈ వైఖరులనూ, విధానాలనూ వ్యతిరేకించి, అన్నిరకాల దౌర్జన్యాలనూ అంతమొందించే ప్రజాస్వామిక ప్రయత్నంలో భాగం కావలసిందని ఆహ్వానం పలుకుతూ...

18.11.2001